## '84 రక్తాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

"జయలక్ష్మి చనిపోయింది."

"ఆ....ఏ జయలక్ష్మి ?? !"

"నీ కెందరు జయలక్ష్ములు తెలుసు ?"

"అంటే..రాఘవగారి భార్యేనా ?! అయ్యో....ఏమయిందిట?"

"......................" మౌనంగా గదిలోనికి నడిచాడు రామ్మూర్తి.

రాత్రి కురిసిన వానకు నేలవాలిన మొక్కలను సరిచేస్తున్న పార్వతమ్మ బురద చేతులు కొంగుకు తుడుచుకొంటూనే, భర్తను అనుసరించి ముందుగదిలోనికి వచ్చింది. రామ్మూర్తి, వాలు కుర్చీలో వాలి, కళ్ళమీద చేతులుంచుకొన్నాడు. పార్వతమ్మ, ఒక్క క్షణం భర్త ముఖంలోనికి చూచి, దగ్గరగా వెళ్ళి, భుజంమీద మెల్లిగా తట్టింది.

కళ్ళు విప్పాడాయన. ఎర్రగా, తడిగా వున్నాయి కళ్ళు. ఇంకా, వాటిలో నీరు వుబుకుతోంది. ఆశ్చర్యపోయింది పార్వతి.

"ఎలా పోయిందటండీ? రెండునాళ్ళ క్రితం పేరంటంలో చూశానే?"

"............" శూన్యంలోకి చూస్తున్నాయి అతని కళ్ళు.

"మాట్లాడరేమండీ?"

గాఢంగా నిట్టూర్చాడు రామ్మూర్తి...."జయలక్ష్మి చనిపోలేదు".

. "మరి!! ఇదేమిటి, ఇప్పుడే చనిపోయిందన్నారు—! మళ్ళీ చనిపోలేదంటారు....మతుండే మాట్లాడుతున్నారా"?


"జయలక్ష్మి చనిపోలేదు పార్వతీ..చంపేశారు" .... దారుణంగా తల పగులగొట్టారు....జయను చంపేశారు.... రామ్మూర్తి కళ్ళనుండి కన్నీరు జలజల రాలి పడింది. నిశ్చేష్టురాలయి పోయింది పార్వతి. జయలక్ష్మిని ఎవరో చంపేశారన్నదానికన్నా భర్త దుఃఖం, కన్నీరు చూసి బ్రమాన్పడిపోయింది నోట మాట రాకుండా నిలబడిపోయిన భార్య ముఖంలోనికి ఓ క్షణం చూసి, మెల్లగా గదిలోనికి వెళ్ళి, తలుపులు బిగించుకొన్నాడు రామ్మూర్తి. కలలో నడుస్తున్నదానిలా, వంట గదిలోనికి వచ్చి పీటమీద చతికిలబడింది. యాంత్రికంగా పనులేవో చక్కబెట్టుతున్నా, ఆమె మదిలో ఎన్నో చిక్కుప్రశ్నలు.... తొలిచేస్తున్నాయి.

జయలక్ష్మి చనిపోయిందంటే.... స్నేహితుని భార్య కనుక దుఃఖంగా వుండవచ్చు— సహజమే....కాని..........కాని.....మరీ. కన్నీరు పెట్టుకుని పిచ్చిచూపులు చూచేటంతటి దిగులా? ఎప్పుడూ "రాఘవ భార్య" అని జయలక్ష్మిని గురించి చెప్పే భర్త, ఆవిడ పేరు చెప్పటం....పైగా ఎంతో చనువున్నట్లు "జయ" అనటం పార్వతికి వింతగా వుంది. ఆవిడ చనిపోయిందంటూనే అక్కడికి వెళ్ళక ఇలా గదిలో దూరి తలుపులు బిగించుకొనడం ?! పార్వతికి అంతా అయోమయంగావుంది అలా గదిలో ఆయనేం చేస్తున్నారో....? అలా అనుకొనగానే ఆమె గుండె దడదడలాడింది. ఒక్క పరుగున వెళ్ళి తలుపులు బాదింది. రెండు నిము



# పాపం దాగదు

సెంటీనా సరోజిని




షాంకు అవి తెముచుకొన్నాయి. ఎమురుగా భర్త.... ముఖం కన్నీటితో మలినమై... భార్యను దాటుకొంటూ హాల్లోకొచ్చాడు. ముందుకు నడుస్తూనే "నేను అలా వెళ్ళవస్తాను... నీవు భోజనం చేసెయ్యి.."

"అయ్యో! కాఫీ అయినా...."

"అక్కర్లేదు..." గేటుదాటి వెళ్ళిపోయాడు. పార్వతి కళ్ళల్లో నీళ్ళూరాయి. ఎంతో నిస్సత్తువుగా అనిపించింది.... తలుపుకు గొళ్ళెంపెట్టివచ్చి మంచంమీద వాలింది. ఉండుండీకన్నీరు పొర్లుకొస్తుంది. ఎందుకో తనకే తెలియదు. జయలక్ష్మి చనిపోయినందుకా? భర్త వింతప్రవర్తనకా? ఆయన కాఫీఅయినా తాగకుండా వెళ్ళిపోయారనా? ఏమో... కాదు! అవును....! కాదు ... ఎక్కడో ఏదో. మోసం జరిగింది.... జరుగుతూంది....తన కళ్ళ ముందే జరిగిందా? తను గ్రహించలేకపోయిందా? తన భర్త ఏదో దాస్తున్నాడు తన నుంచి. ఏమిటది? జయలక్ష్మి స్నేహితుని భార్యేనా? లేక వీరిద్దరి మధ్యా ఏమున్నా? ఇదివరలో జయలక్ష్మి భర్తతో కలిసి తమ యింటికి వచ్చిన సంఘటనలు, తామిద్దరూ. వారి ఇంటికి వెళ్ళిన సందర్భాలు. గుర్తుచేసుకొంది పార్వతి. జయలక్ష్మి తన భర్త మధ్య సంభాషణలు గుర్తుచేసుకొంది. వాటిలో ఏవైనా లోతు. అర్థాలున్నాయా? తనకు తెలియని రహస్య సౌంజ్ఞలున్నాయా? ఏదైనా 'కోడ్' భాషలో మాట్లాడుకొన్నారా? పార్వతి ఆలోచిస్తుంది పరిచయం అయిన మొదటిరోజే.... "అన్నయ్యగారూ, వదినా" అంటూ, వరుసలు కలిపే స్త్రీలంటే తనకు పరమ చిరాకు. అనవసరంగా సిగ్గుల పెళ్ళికూతుర్లా తలొంచటం....మగవారిని చూచి పరుగులెత్తటం....అలాటి వేషాలేలేవు జయలక్ష్మిలో అందుకే ఆమె అంటే తను ఇష్టం ఏర్పరచుకొంది. కాని ఇప్పుడు ఒక్క విషయంలో తన మనస్సుకు సమాధానం చిక్కటంలేదు... జయలక్ష్మి భర్తకు ఆవిడపై అనుమానం. ఆ విషయం ఎప్పుడో చూచాయిగా ఆవిడ చెప్పింది. భర్త ఎన్నో మాటలు తనతోనూ అన్నాడు .... ఆ విషయంలో స్నేహితుని మందలించినట్లూ చెప్పాడు .... భర్త అనుమానం- అనుమానమేకాదా? నిజమా? ఆవిడ ప్రియులెవరో చంపారా? లేక భర్తే కోపంతో....?

"అమ్మా....తలుపు తీయండి...." పనిమనిషి పిలుపుతో ఆలోచనలు ఆపి, తలుపు తీసింది పార్వతి.

లోపలకు వచ్చిన వర్సమ్మ రోజులా నేరుగా వంటగదిలోనికి వెళ్ళలేదు పరీక్షగా పార్వతి ముఖంలోనికి చూస్తూ "ఎంత దారుణం జరిగిపోయిందండమ్మా.." అంటూ అక్కడే కూలబడింది. పార్వతీ అక్కడున్న కుర్చీలో కూర్చుంది.

"నేనెల్లి చూశానమ్మా.... అబ్బబ్బ.... ఏం జనం! ఏం జనం! పోలీసోల్లు .. ఆఫీసర్లు.... ఆ ఈదిన" నందులేదనుకోండి.

"ఆమెను నువ్వు చూశావుటే...." మెల్లగా అడిగింది.

"ఆ ... ఈలు కాలేదమ్మా.... పోలీసులు తీసుకుపోయారంట అస్పత్రిల చూసి మళ్ళీ దెస్తరంట.... అమ్మా! తమరికి సుట్టాలు గదా? చూదరా ఎల్లి....?"

"ఆ....ఊ...."

"ఆయమ్మ మంచిదేటమ్మ. కాని అయ్యగోరుకి అనుమానం....కట్టపెట్టేటోరంట.... మన అయ్యగారూ.... ఆరింటికి ఎల్లుతుంటరటమ్మా.... నేనూ చూసిన...."

"...................."

"ఏటో.... గొప్పోళ్ళ కతలు ... మాకేం తెలుస్తయి" వర్సమ్మ లేచి, పెరట్లోనికి వెళ్ళిపోయింది. జవాబు తెలియని ప్రశ్నలతో పిచ్చిపట్టినట్లుంది పార్వతికి.

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో. ఇంటికొచ్చాడు రామ్మూర్తి. ఎన్నాళ్ళుగానో నీళ్ళు.నిద్రాహారాలు లేకుండా, ఏ. ఎడారిలోనో ప్రయాణం చేసి వచ్చిన బాటసారిలా, దుమ్ము కొట్టుకుని సొక్కిపోయి వున్నాడు. కొన్ని సంవత్సరాల వృద్ధాప్యం అతన్ని లొంగదీసినట్లుంది. మౌనంగా, స్నానానికి ఏర్పాటు చేసి భోజనం వడ్డించింది. "ఆకలి లేదు. కాస్త కాఫీ ..." నీరసంగా పక్కమీద వాలాడు. తనూ ఓ కప్పు తీసుకుని భర్త దగ్గరగా కూర్చుంది, అతని ముఖంలోనికే ఆత్రుతగా చూస్తూ ఒక్కో గుక్కా తాగసాగింది. కాఫీ తాగటం ముగించి. పండుకుని కళ్ళు మూసుకున్నాడు రామ్మూర్తి. అంతవరకూ, అతనేదైనా చెప్తాడన్నట్లు ఎదురుచూసిన పార్వతి, భర్త మౌనంగా కళ్ళు మూసుకొనటం చూసి ఇక వుండలేకపోయింది, భర్తను కుదుపుతూ. గట్టిగా అడిగింది. "ఆసలేము జరిగిందండీ ..? మీరేమిటి ?" ఆమె కంఠం, రుద్ధమయింది. నోరు తడారిపోయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.........భర్తను అనుకుని కూర్చుంటూ. భోరున ఏడ్చేసింది. లేచి కూర్చున్నాడు రామ్మూర్తి. భార్యను ఓదారుస్తున్నట్లు వీపు రాస్తూ "అంతా అయిపోయింది పార్వతీ.... జయను ముక్కలు, చెక్కలు చేసి ఇచ్చారు. వాటినే. పిడికెడు బూడిద...." గొంతు ఎవరో నొక్కినట్లు ఆగిపోయాడు. కొన్ని క్షణాలు నిశ్శబ్దం, నూతిలోనుంచి వచ్చినట్లు వున్నాయి పార్వతి మాటలు.

"ఎవరో.... తెలిసిందా....?"

"ఇప్పటికి లేదు...."

ఆ రాత్రి- నిద్రా మెలకువల మధ్య ... పీడ కలలతో.... కలవరింతలతో.... భారంగా బాధగా గడిచింది. నాలుగు దినాలు గడిచాయి....భయం భయంగా.... ఆ రోజు చిగురుటాకులా వణికిపోతూ ఇంటికొచ్చాడు రామ్మూర్తి, ఎదురొచ్చిన భార్యతో.

"అతన్ని... రాఘవను అరెస్టు చేశారు" అన్నాడు. అదిరిపోయింది పార్వతి. భర్తను చెయ్యిపట్టి కూర్చుండబెట్టి... చల్లని నీళ్ళు త్రాగటానికిచ్చి, ఫ్యానువేసి. దగ్గరగా కూర్చుంది మౌనంగా భర్త ముఖంచూస్తూ, ప్రశ్నించటానికి ఆమెకు మనస్సు రాలేదు. అతని ముఖంలో లోకంలోని బాధ, దుఃఖం, నిస్పృహాయత కుప్పపోసినట్టుంది. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం .... భయం గొలుపుతోంది.

"రాఘవ.... అంత ఘోరం చేసి వుంటాడంటావా?"

ఒక్క నిముషం— పార్వతి మాట్లాడలేక పోయింది....

"అతనికి భార్య మీద అనుమానం...."

"ఇడియట్... వాడిని. ఆ విషయంలో ఎన్నో మారులు మందలించాను....జయ అలాంటిది కాదు ..."

"మీ కెలా తెలుసు? ఆయన అనుమానమే నిజమేమో అందుకే ..."

"పార్వతీ .. యు .. యూ ఫూల్.... తోటి ఆడదాన్ని ఆ మాట అనటానికి సిగ్గులేదూ?.... జయ.... జయ దొడ్డ ఇల్లాలు... నాకు తెలుసు...."

రామ్మూర్తి కన్నులు నిప్పులు కురిశాయి. పార్వతి ఖిన్నురాలయింది. అంతలో సర్దుకొన్నాడు రామ్మూర్తి... అతి శాంత స్వరంతో అనునయిస్తున్నట్లు అన్నాడు. "మనకు తెలియని విషయాల గురించి అందునా ఈలాంటి సున్నితమైన విషయాల గురించి మాట్లాడకూడదు పార్వతీ....ఆ రాత్రి రాఘవ వూర్లో వున్నా ఇంట్లో లేదు...."

"మరి ..." గొంతు పెగల్చుకుని అడిగింది పార్వతి.

"రెండురోజులక్రితం ఏదో పనిమీద హైదరాబాదు వెళ్ళాడు. ఆ రాత్రి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాడట తిరిగి ...బాగా వర్షంగా వుండటంతో, ఆటోలు చిక్కలేదట.... స్టేషను దగ్గరగా వున్న హోటల్లో రాత్రి గడిపి. ఉదయం ఇంటికి వచ్చాడట...."

"మరి పోలీసులకా విషయం చెప్పలేదా....?"

"చెప్పకేం? చెప్పాడు. వారి దర్యాప్తులో తేల్చుకొన్న విషయాలు వున్నాయి. రాఘవ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ దిగేసరికి రాత్రి పది గంటలయింది. ఆ సమయంలో అసలు వర్షం లేదు. పదిన్నర ప్రాంతంలో వర్షం ప్రారంభమయింది. అతను హోటల్లో వున్నది నిజమే కాని. కారణం వర్షం కాదు. పైగా. మరో ముఖ్య విషయం.... ఒంటి గంట ప్రాంతంలో ఆ రాత్రి రాఘవను వాడి ఇంటి ముందే చూశానని చెప్తున్నాడు పొరుగింటి భూషణంగారు....దానికి ఏమీ సమాధానం చెప్పటం లేదు రాఘవ. అనుమానంపై అతన్ని కస్టడీలోకి తీసుకొన్నారు...."నిట్టూర్చాడు రామ్మూర్తి.

ఏమనాలో తోచని పార్వతి మౌనంగా కూర్చుండిపోయింది. మరో మూడు రోజులు మూగగా ముందుకు సాగాయి.

ఆరోజేదో పండుగ సెలవు....ఇంట్లోనేవున్నాడు రామ్మూర్తి పది గంటల ప్రాంతంలో ఓ పోలీసు జీపొచ్చి ఇంటి ముందు ఆగింది. ఆహ్వానించి కూర్చోబెట్టాడు రామ్మూర్తి. రాఘవ దంపతులతో అతనికిగల స్నేహాన్ని గురించి, జయలక్ష్మిపై భర్తకుగల అనుమానం గురించి ప్రశ్నించాడు పోలీసు ఆఫీసరు. యథాలాపంగా అడిగినట్లే - ఎన్నో ప్రశ్నలడుగుతున్న అతను వున్నట్లుండి సీరియస్‌గా ముఖం పెట్టి "ఆ రాత్రి .... మీరు రాఘవగారి ఇంటికెళ్ళినట్లు తెలిసింది కారణం చెప్పగలరా?" పాలిపోయి తెల్లబడింది రామ్మూర్తి ముఖం. చాటుగా నుంచుని అంతా వింటున్న పార్వతి ప్రక్కనే ఆటంబాంబు పేలినట్లు వులిక్కిపడింది. గుండె దడదడలాడింది. భర్త జవాబు కొరకు వొళ్ళంతా చెవులు చేసుకొంది.... అంతా నిశ్శబ్దమే. చెప్పండి రామ్మూర్తిగారూ— ప్లీజ్ ఈ దర్యాప్తులో మీ హెల్ప్ మాకెంతో అవసరం .... మీరు రాఘవగారి స్నేహితులు గనుక.... మీకు ఎన్నో విషయాలు తెలిసివుంటాయి... " రామ్మూర్తి తల దించుకుని కూర్చున్నాడు మౌనంగా ..."ఆ రాత్రి రాఘవగారు ఇంట్లోలేరని మీకు తెలుసనుకొంటాను . ?"

తెలుసన్నట్లు తల ఆడించాడు రామ్మూర్తి."మరి అతను లేని సమయంలో, అందునా రాత్రి....అతని భార్య వొంటరిగా వున్న సమయంలో మీరు వారి ఇంటికి ఎందుకు వెళ్ళినట్లు"?


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి




- శస్త్రచికిత్స
అవసరములేదు!

చర్మ రోగం సోకిందా?



ఉపశమనం కల్గించే లిచెన్సా స్కిన్ అయింటుమెంటు నిరపాయకరంగా, శీఘ్ర నివారణ కలిగిస్తుంది.

రుజువు చేయబడిన 6 మందులతో కూడిన నిరపాయకరమగు నాజూకైన మలాము అమోఘంగా పనిచేస్తుంది చర్మరోగాలకు, కోతలకు, పుండ్లకు....మరియు మొటిమలకు, చెమటకాయలకు పొడుపుడుకాయలకు!

చర్మరోగాలు కన్పించీ కన్పించడంతోటే నిరపాయకరమైన శీఘ్ర నివారణకు లిచెన్సా వెంటనే ఉపయోగించండి.




6 TG.B

లిచెన్సా
స్కిన్ అయింటుమెంటు

ఇబ్బందిగా కదిలాడు రామ్మూర్తి. పార్వతికి పాతాళంలోనికి కృంగిపోతున్నట్లుంది. తను నిద్రపోయాక. ఆయన బైట కెళ్ళారా ఆ వర్షంలో? నిజంగానే రాఘవగారు లేనిసమయంలో ఆయనకు వాళ్ళ ఇంట్లో పనేమిటి? తల తిరుగుతున్నట్లయింది. పార్వతికి....కళ్ళు మసకబారుతున్నాయి. ఏం జరుగుతూందో తెలిసేంతటిలోనే. భర్త గదిలోకి రావటం "భయంలేదు పార్వతీ" అనటం. మరు నిముషం పోలీసుల వెంట జీపులో వెళ్ళిపోవటం.. జరిగిపోయింది. పార్వతి కెవ్వున అరుస్తూ. కుప్పకూలిపోయింది.

ఆ రాత్రి ఎప్పుడో వచ్చిన భర్తను చుట్టుకుపోయి చిన్న పిల్లలా బావురుమని ఏడ్చింది రామ్మూర్తి భార్యను అక్కున చేర్చుకుని. జుట్టు సవరిస్తూ చెంపలు రాస్తూ కూర్చుండిపోయాడు. పార్వతి అతన్ని ఏమీ ప్రశ్నించలేదు... అతనూ ఏమీ చెప్పలేదు.

ఆరోజు అన్యమనస్కంగా ఆఫీసు ఫైలు తిరగేస్తున్న రామ్మూర్తికి "మీకోసం ఎవరో ఆడవాళ్ళొచ్చారు సార్" అని చెప్పాడు ఆఫీసు ప్యూను. ఆశ్చర్యపోతూ వడివడిగా విజిటర్సు రూములోనికి వచ్చాడు. మూలనున్న స్టూలుపై కూర్చుని వుంది మంగమ్మ. రామ్మూర్తిని చూస్తూనే లేచి నుంచుని. ముఖానికి రెండు చేతులుంచుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. రామ్మూర్తి రెండు నిముషాలు గడవనిచ్చి. గంభీరంగా ఆజ్ఞాపిస్తున్నట్లు అన్నాడు.... "ఆపు మంగమ్మా. కూర్చో ... విషయం చెప్పు." మంగమ్మ ఏడవటం ఆపినా ఇంకా వెక్కుతూనే వుంది. రామ్మూర్తి కిటికీలోని కూజా వొంపి గ్లాసుతో ఆమెకు నీళ్ళందించాడు. వాటితో ముఖం తుడుచుకుని. గుక్కెడు గొంతులో పోసుకుని స్టూలుపై కూర్చుంది. సూటిగా ఆమె కళ్ళలోనికి చూస్తూ "ఇక. చెప్పు ..." అన్నాడు. ఆమె కళ్ళల్లో మళ్ళీ తడి కనిపించింది.... రుద్ధ కంఠంతో అడిగింది "బాబుగారిని ఎప్పుడు వొదులుతారు. బాబూ"?

"వొదిలేస్తారని ఎవరు చెప్పారు నీకు?"

"ఆ..! మరి వొదలరా?!" ఆమె కంఠం పూడుకుపోయింది.

"జయలక్ష్మిని చంపింది. రాఘవ కాదని తెలియాలికదా?? మరి అతను కాదంటే. మరెవరు...."??

"........ ........ ...."

"నీకు తెలుసా మంగమ్మా? ఆ రాత్రి. నీవు సినిమాకెళ్ళి. రాత్రి బంధువులింట్లో వుండి ఉదయం పనిలో కొచ్చానన్నావు పోలీసులతో.... అది నిజమేనా?"

నిజమేనన్నట్లు.... తల ఆడించింది మంగమ్మ.

"ఏ సినిమా కెళ్ళావు? ఒక్క దానివే వెళ్ళావా?"

"అదేదో మళయాళం సినిమా .... మా బంధువులతో ఎళ్ళా...."

"అదే. ఆ బంధువులెవరు??? ఎక్కడుంటారు?"

"వాళ్ళు....ఆ రాత్రే వూరి కెళ్ళారు...."

"మరి- రారా?"

"ఏమో...." తల దించుకుని కూర్చుంది మంగమ్మ.

"మరి, ఇప్పుడు నీ వెందుకొచ్చినట్లు" విసుగు ధ్వనించింది రామ్మూర్తి కంఠంలో. ఉన్నట్లుండి. తిరిగి మంగమ్మ ఏడవ సాగింది. ఆమె శరీరం మలేరియా జ్వరపురోగి-శరీరంలా వణకసాగింది. ఏదో వున్మత్తస్థితి ఆవరించినట్లు, పెద్దకంఠంలో చెప్పసాగింది...."బాబుగారికి. ఏమీ తెలియదు. అంతా చేసింది రవిబాబు....రవిబాబే...." మంగమ్మ పెద్ద పెట్టున. ఏడవసాగింది. రామ్మూర్తి మంగమ్మను. కుదిపేశాడు "రవి బాబెవరు....చెప్పు చెప్పు...."

"ప్రక్కింటి భూషణంగారి అబ్బాయి.... అతనికీ ... నేను.. అతనూ...అతనికీ "మళ్ళీ ఏడుపు అర్థం అయింది రామ్మూర్తికి. మంగమ్మ వయస్సు పొంకం తగ్గని విధవ...రవి- మార్గం తప్పి యౌవనమదంతో తిరుగుతున్న డబ్బున్న వారి కొడుకు....

"అతనా రాత్రి అక్కడి కెందుకొచ్చాడు...."?



తగ్గు స్వరంతో అతిమెల్లగా చెప్పింది మంగమ్మ "నేను ఆతనూ, చాలా రోజులుగా కలుసుకొంటున్నాము. రెండు రోజుల క్రింతం. నన్ను అమ్మగారినడిగి, రెండు వందలు ఇవ్వమని అడిగాడు....బాగా తాగుతాడు....నేను మా ఊరి నుంచి మనిషొచ్చాడని. మా అమ్మకు వైద్యానికి డబ్బు అర్జంటుగా కావాలని. అమ్మగారిని అడిగాను. తన దగ్గర లేవంది.... అయినా నా ఏడుపు చూసి ఎవరినైనా తెలిసిన వాళ్ళను అడిగి ఇస్తానంది."

"అవును నన్ను అడిగింది.. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఇద్దామనుకుంటూనే మరచిపోయాను. చాలా అర్జంటు అంది. అందుకే ఆ డబ్బు తెచ్చి రాత్రికి రాత్రి ఇచ్చిపోయాను...."

కన్నీళ్ళు తుడుచుకుంది మంగమ్మ. "తల్లి ఆ రాత్రి కాదనాకు డబ్బిద్దామనుకొంది కాబోలు. వెనుక వరండాలో నేను పడుకొనే గది దగ్గరకొచ్చి పిలిచి ఇచ్చింది. తలనొప్పిగా వుందంటే, కాఫీ చేసి ఇచ్చాను. పడుకొన్నారు. ఆ రాత్రి రెండు గంటలప్పుడు రవిబాబు వచ్చాడు. నా కోసం....డబ్బు కోసం.... అయ్యగారు లేరన్న ధైర్యంతో గది లోపలకు పిలిచాను.... మేమిద్దరం....అలా....యిద్దరం....అమ్మగారు బాత్‌రూముకొచ్చి చూశారు....లైటు వెలుగులో, రవిబాబును గుర్తించి "రవీ.... నీవా!!!" అన్నారు.... అంతే .... అంతే .... ర వి బా బు క్షణంలో బాయిలరు క్రింది ఇనుప గరిటెతో అమ్మగారి తలమీద, పిచ్చివాడిలా మోదేశాడు .... ఆ గరిటె అలా పట్టుకొనే, పరుగెత్తి వెళ్ళిపోయాడు.... వెళ్తూ "నగలు తీసి దాయి.... ఏ దొంగలో అనుకొంటారు... " అన్నాడు..... నాకు చేతులు రాలేదయ్యా.... అలా ఎంతసేపు కూర్చున్నానో.... తెల్లవారిందే తెలియలేదు...." చెప్పటం ముగించి "రండి బాబూ.... రండి....మా బాబుగారిని విడిపిద్దాము. వారి ఉప్పు తిని....ఇలా.." ఏడుస్తూనే ముందుకు నడిచింది మంగమ్మ. కలలోలా ఆమెను వెంబడించాడు రామ్మూర్తి. పోలీసు స్టేషన్లో స్టేట్‌మెంటు ఇచ్చింది....

మరునాడే రవిబాబును అరెస్టు చేశారు. హత్యాయుధమూ దొరికింది.

ఆ రోజు... రామ్మూర్తి స్నేహితుని అడిగాడు "రాఘవా! ఆ రాత్రి నీవు హోటల్లో వున్నావా? ఎందుకు? మళ్ళీ మీ వీధిలో, మీ ఇంటి ముందు, భూషణం గారికి కనిపించటం నిజమేనా"? అని.

ఒక్క క్షణం స్నేహితుని కళ్ళలోకి చూసి తలదించుకొన్నాడు రాఘవ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా, ఎంతో వ్యధతో అన్నాడు .."జయను... జయను....రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుందామనుకొన్నాను....నా అనుమానం...." విచారంగా నవ్వాడు రా మ్మూ ర్తి ........" అ యి తే........అ లా వ చ్చి ........ చూసి పోయానన్నమాట....హూ....నేరుగా ఇంటికి వచ్చి వుంటే యింతటి ఘోరం...." రాఘవ చేతుల్లో ముఖం దాచుకొన్నాడు. మానసిక విశ్రాంతి కావాలంటూ ప్రదేశాలు తిరిగి వస్తానంటూ ప్రయాణమై వెళ్ళాడు రాఘవ.

జవాబు తెలియని ప్రశ్నలతో మనోవేదనను భరిస్తోంది పార్వతి. ఎంత మరిచిపోదామన్నా మరుపు రావటంలేదు. అందుకే ఒక రోజు భర్తను అడిగేసింది "జయలక్ష్మి, రాఘవ భార్యగానేగాక మీకు ముందే పరిచయంవుందా....?"ఆమె గొంతు, శరీరం వణికింది. భార్య కళ్ళలోనికి చూస్తూ ఎంతో నిశ్చలంగా జవాబిచ్చాడు రామ్మూర్తి.! "జయతో నా పరిచయం చాన్నాళ్ళది" భూమి దద్దరిల్లినట్లయింది పార్వతికి. తెల్లబోయింది. రామ్మూర్తి పెదవులపై ఓ శుష్క హాసం .. "అవును పార్వతీ, జయలక్ష్మి. జయ... మా అమ్మ కూతురు..నా అక్కయ్య. చనిపోయిన తల్లి. ఆమె కిచ్చిన వాగ్దానం గుర్తురాగా, కళ్ళల్లో కన్నీరుబికింది....రుద్ధకంఠంతో మళ్ళీ అన్నాడు "జయక్క, మా అమ్మ కూతురు..."

పార్వతికి అర్థం అయింది. ఆమె గుండె తేలికయింది.బరువెక్కింది........

